
C

ట 8113
142

ప్రవాహ

(పాటల సంపుటి)



మలిరెడ్డి

C I

ప్రవాహం

(పాటల సంపుటి)

ట 8113/142

మలిరెడ్డి

ప్రతులకు
విశాలాంధ్ర ప్రచురణాలయం
విజయవాడ-2

ప్రచురణ : ఫిబ్రవరి '56

వెల : 0-5-0

0-35

ముద్రణ :

స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్సు,

విజయవాడ-2.

TPLA126B118

పరిచయం

★

1946 వ సంవత్సరమునుంచి చరిత్ర ప్రవాహం లోని కొన్ని సంఘటనలు నా హృదయాన్ని కదిపి, నాలోని భావాలను యీ పాటల రూపంలో వెలువడ జేసినై. వాటిలో కొన్నిటిని అభ్యుదయ, ఉదయిని, విశాలాంధ్ర మొదలగు పత్రికలు సహృదయంతో ప్రచురించినై. ఆ పత్రికా సంపాదక మహాశయులకు నా అభివందనాలు.

నేడు నేను ఆ పాటలలో కొన్నిటిని, నా వద్ద నున్న వాటిలో మరికొన్నిటిని చేర్చి గ్రంథరూపమున వెలువడజేయుచున్నాను. ఈ నా కృషికి ఆంధ్ర పాఠక మహాశయులు ఆదరాభిమానములు చూపగలరని ఆశించుచున్నాను.

ఇట్లు,

మలిరెడ్డి వెంకటర...

జనార్దన...

3

4

అంకితము

విశాఖజిల్లా క్షామపీడితుల సేవలో అసు
మిత్రుడు రాఘవరెడ్డికి

రైతులోకపు సౌఖ్యదాయీ
రైతుసేవకు గీటురాయీ
రైతులెన్నడు మరువలేరోయీ
ఓ వీరరాఘవ
రైతుసేవకె ప్రాణమిచ్చావోయ్.

పిలచినది నిను రైతుసంఘము
తలచినది విశాఖ జనము
పిలచినంతనె పలికినావు
తలచినంతనె తరలినావు
అలసటెరుగక సేవ జేశావోయ్
ఓ నేస్తకాడ
ఆర్తిజనులకు జ్యోతివయ్యావోయ్.

కరువురాక్షసి కోరపెరుక
వెరపెరుంగక ముందుకురికి
మరణమన వెనుతిరిగిచూడక
మరణమున ప్రజసేవవీడక
అమరఖ్యాతిని నీవు గొన్నావా
ఓ వీరయోధుడ
అలపుతీర నిద్రబోయావా.

మానవుడా!

గానిస బంధితుడా
రిద్ర పీడితుడా.

నుముల కోర్చికోర్చి
కార్చికార్చి
తి పరిపాలన
ోయ కదలితివా. 1

నీ బాధలు హద్దుమీరి
నీ ఓరిమి కడకుజారి
ఘరేగు నీదు గుండె
ఘరేగు నీ యడంద
మండిందా నేటికి
మండిందా. 2

గి అణగి లేములలో
గి అరగి పాములలో
ళయకాల భానునివలె
ంయకాల రుద్రునివలె
దుమికితివా ధీరత
దుమికితివా. 3

మాట్లాడే హక్కులేక
పొట్టకింత కూడు లేక

నరపశువుగ బ్రతుకలేక
న్యాయముకై నిలచిపోర
లేచితివా యటు
లేచితివా. 4

నీ శక్తికి యెదురులేదు
నిశ్చయముగ జనులంతా
నీవారలె, నీవారలె
అన్యాయపు రథముకూలు
ఈరాజుల రోజుమారె
పరిపాలన మనదేనోయ్
పరపీడన యెన్నాళ్ళోయ్
లేలెమ్మని - రారమ్మని
పిలచితివా పీడితులను
పిలచితివా. 5

అ ప ర ప న్నా

విన్నావురా సోదరా
అపర పన్నాకథ విన్నావురా.

తెలగాణలో నొక్క పేదరైతుండె
రెక్కల నమ్ముకొని తా బ్రతుకుచుండె
కలదువానికి నొక్క ముసలితల్లి
యేకైక పుత్రిక సీతమ్మతల్లి. 1

వానికుండెను రెండు యకరాలకొండ్ర
కూడబెట్టెను దాని కష్టపడి తండ్రి
తండ్రిచచ్చిన వెనుక తగవులుబెట్టి
దేశముఖు ఆ భూమి తన్ను చేపట్టె. 2

కష్టాలజంకక గుండె బిగబట్టి
పెంచుచుండెను ప్రేమ తన ముద్దుపట్టి
అవ్వకుతోడౌచు నా మనుమరాలు
పనులన్ని చేయును భయసంభ్రమాల. 3

యిట్లుండ వొకనాటి సాయంత్రమందు
వచ్చెను రజాకార్ల మిలటరీదండు
వ్యాఘ్రాన్ని జూచిన గోవుల రీతి
వూరెల్ల గడగడవణకెనుభీతి. 4

స్త్రీలను చెరచుటకు చిచ్చుబెట్టుటకు
మగవారినందరిని మట్టుబెట్టుటకు

యింటింటికినిచుట్టి వారు మూగారు
క్రూరులు ఘోరాలు చేయసాగారు. 5

అవ్వ ఆ తరుణాన నీటికిబోయె
సీతమ్మ యింటిలో వొక్కతేనాయె
రాకాసు లేడుగురు యింటిలోదూరి
వణకెడు ఆబాల చుట్టును జేరి. 6

యేడ్పుచు మొరబెట్టు నామె బడగొట్టి
చరచసాగిరి అకట బలవంతబెట్ట
ముసలమ్మ యింతలో దీని చూచింది
రక్షించు, రక్షించుడంచు యేడ్చింది. 7

వెతవేరు మార్గాన్ని వెదకసాగింది
మతిబోయి నలువైపు కలియ దిరిగింది
గతిలేదు బ్రతకదని గట్టిగాదలచి
హృదిలోన దేవుణ్ణి వొకసారి దలచి. 8

వీరులకు ఆదర్శమైన కార్యంబు
చేయగా తలపెట్టె నొక సాహసంబు
తలుపులంటికి బైట గొళ్లెములు బెట్టె
నలుగడల యింటికి చిచ్చుమెగబెట్టె. 9

నీచులు మంటలోబడి మాడిపోయె
భళియంచు పురజనులు ముదివేడుకొనియె
ఆదర్శమైన యీ అమరచరితంబు
ఆంధ్రులకు ఆదర్శమౌను నిరతంబు.

వ్యవసాయకూలీ!

లేవోయి రావోయి వ్యవసాయకూలీ
లేచిరావాలోయి వ్యవసాయకూలీ.

బంజరుభూమికి పదునుగూర్చి
పంటలధికముగ పండించేటి
వొంటచెమటతో మంటికి చేవ
కలిగించేటి కష్టజీవివి. ॥ లే ॥ 1

అజ్ఞానంలో – అంధకారములో
మూర్ఖత్వంలో – మురికి కూపములో
బహుకాలముగా – పడివుంటివిగా
కన్నులువిప్పి కాంతిని గనుము
సంఘబలములో శక్తినిజూడు ॥ లే ॥ 2

సోదరరైతుతో చేతినిగలిపి
ఐక్యమార్గమున అడుగిడినడువ
యెదురేదోయ్ నీ శక్తికి
జమిందారులు – షాహుకారులు
స్వార్థపరులగు – పెత్తందారులు
చీలికలొట్టే చీడపురుగులు
పటాపంచలై పారిపోవుదురు ॥ లే ॥ 3

కర్షకలోకం

కర్షకలోకం కన్నులు దెరచి
కదిలిందోయ్ కదిలింది.

కడులేమిచే కనలికనలి
పలుబాధల పొగిలిపొగిలి
భృతికోరకై గతిలేకను
యితలింకను పడలేకను
తరతరాల తమ హక్కుల
దోచిన పరాన్నభుక్కుల
ఆటలేమి సాగవని
మాటలేమి ఆగవని ||క|| 1

యేటిపొడుగునా చాకిరిజేసి
యెంతపండినా కూటికివాచి
భూస్వామికి, ఋణదాతకు
శిస్తులకే చెల్లిపోవ
పుస్తెలమ్మి బ్రతుకలేక
ఆకలితో చావలేక ||క|| 2

"దున్నేవానికె భూమిహక్కు
కృషిజేసేవానికే ఫలితం"
ధరాతలాన యీ ధర్మాన్ని
స్థాపిస్తానని శపథముజేసి
వీరత్వంతో లేచింది
విజయశంఖమును వూదింది ||క|| 3

యువలోకం

యువలోకం పిలిచింది
నవలోకం పలికింది.

దాసత్వాన్ని - దారిద్ర్యమును
అజ్ఞానాన్ని - అనైక్యతను
మూర్ఖత్వాన్ని - ముష్కరత్వమును
పారద్రోలుటకు - కూలద్రోయుటకు
పరుగున లేచి - ప్రతినను బూని
యువలోకం కదిలింది
నవలోకం యెదురైంది. 1

నిరక్షరాస్యత - నిరుద్యోగము
ఆర్థిక బాధలు - ఆకలి వ్యాధులు
దౌర్జన్యపాలనము - బహుపీడనము
చీల్చివేయుటకు - కాల్చివేయుటకు
పిడికిలి లేపి - బడలికనాపి
యువలోకం లేచింది
నవలోకం చూచింది. 2

విజ్ఞానంతో - వివిధకళలతో
శాంతి సంపదతో - సౌఖ్యరాసితో
స్వాతంత్ర్యముతో - సమధర్మముతో
ఆనందముతో - అరుణకాంతులతో
నవలోకం పలికింది
యువలోకం పిలిచింది. 3

గర్జించిరి విద్యార్థులు

గర్జించిరి విద్యార్థులు
తమ కష్టాల్, తమ నష్టాల్
తరలి తరలి తొలగిపోవ
గర్జించిరి విద్యార్థులు
కూటికిచాలని కుటుంబ బాధలు
వేతనములకై అప్పుల బాధలు
పడిపడి చదువగ వడివడిరాగా
సీట్లులేవని ద్వారబంధనమా !
వీలుగాదు వీలుగాదు
పెట్టింపుడు రెట్టింపు తరగతుల
కట్టించుడు విద్యాలయముల
రప్పించుడు ఉపాధ్యాయుల
విద్యాభివృద్ధిని ఆపే
వింతపోకడలు తగవని ॥గ॥ 1

బడలికతో పడిలేచుచు
మైళ్ళకొలది నడచినడచి
బడికిరాగ తిండివసతి
కానరాదు, లేనెలేదు
కూడంతా కుక్కలుతిన
క్షుద్బాధతో మాడటమా !
వసతియిండ్లు నిర్మింపగ
వద్దువద్దు ఆలశ్యం

యీక్షణమే లేవండని
కార్యదీక్ష పూనండని ||గ|| 2

క్లాసుబుక్సురాక కొంత
వుపాధ్యాయులు లేక కొంత
కొరతలతో గోడుజెంది
తుదకెట్లో చదువచదువ
డిటెన్షన్ అడ్డుపెట్టి
దిగువక్లాసుకే పడమని
దిగదీయుట యిది తగునా
తగదండీ తగదిది
విద్యార్థుల వృద్ధిగోరి
డిటెన్షన్ రద్దుజేసి
ప్రజాతంత్ర పద్ధతిలో
నడిపించుడు విద్యలనని ||గ|| 3

ఓ విద్యా ప్రభువుల్లారా
ఓ కమిటీ సభ్యుల్లారా
యోచించుడు తిరిగి మరల
యిది
విద్యల పోషించే తీరుగాదు.
దేశము పెంపొందే దారిగాదు
తగ్గించుడు మా జీతాల్
హెచ్చించుడు పంతుళ్ళకు
ప్రజలబాధ లరసిమీరు
పరిపాలన జేయండని ||గ|| 4

ఉగాది

ఉగాది
నవ యుగాది
నేడే, నేడే వచ్చింది
నవ సందేశం యిచ్చింది
విజయ నగారా నినదించింది
విప్లవశంఖం వినిపించింది
బానిస శృంఖల బంధితులారా
దుముకండిక, దుముకండి
దిక్కులెల్ల పిక్కటిల్ల
లోకమెల్ల వొక్కటవ
ఒకగొంతై గర్జిస్తూ
ఒకశక్తై యెదిరిస్తూ
దుముకండి
దుముకండని మేల్కొల్పుచు ।ఉ। 1
బీటలువారెను శ్యామలకోటలు
కనబడుచుండెను విముక్తిబాటలు
ప్రపంచ పీడిత ప్రజలారా
పదండి ముందుకు పదండి
బంధనములు తెగిపడ
భాగ్యరేఖ లగుపడ
ఒక అడుగున
ఒక మాటన

ఒక బాటన
పదండి
పదండని పిలుపిచ్చుచు ॥ఉ॥ 2

మీా శాంతి సౌఖ్యమార్గానికి
మీా క్రాంతి పురోగమనానికి
నూతన యుగ నిర్మాతల్లారా
తొలగించుడు అడ్డం
ధరిత్రి మ్రింగు రాహువుల
చరిత్రనష్ట బాహువుల
ప్రళయానల, ఘాలానిల
ఝంఝూనిల జ్వాలలవలె
తొలగించుడు
తొలగించుడుఅని తెల్పుచు ॥ఉ॥ 3

శ్రమజీవియె విశ్వకర్త
ఫలితానికి అనుభవోక్త
యీా ధర్మం స్థాపించగ
లోకమెల్ల వ్యాపించగ
లోకమెల్ల యీా ధర్మం
వ్యాపించగ స్థాపించగ
నడువండని
ముందుకు నడువండని పల్కుచు ॥ఉ॥ 4

నవంబరేడు

నవంబరేడు నేడే
నవోదయం యీనాడె
తరతరాల చీకటి తెర
యుగయుగాల బానిస చెర
తెరలించిన తొలగించిన
శుభదిన మీనాడె
సుఖదిన మీనాడె. 1

అట్టడుగున అణగి అణగి
అనాథులై పడివుండిన
అనంతమూ బాధితప్రజ
అనేకమూ బంధితప్రజ
విముక్తిదిన మీనాడె
విజయోత్సవ మీనాడె. 2

చీకటి తెర మరుగునబడి
వేకువఝామునకు ముందే
కూకటివ్రేళ్లను తెంచుక
రాకాసులు పరుగులిడిన
తొలిదిన మీనాడె.
(పాపుల)
పాపుల పరాజయ మీనాడె

రష్యాలో రగిలిన జ్వాలలు
ప్రజ్వలించి, పయనించి 3

జాజ్వల్యముగా లేచిజాచి
జగమునెల్ల కలయవీచి
ఇటు ఆశ్యా, అటు యూరప్
యెటుజూచిన అటుతానై
వందకోట్ల మానవుల
బంధనాలు తెగగొట్టిన
విజయమార్గ మీనాడే
విశ్వశాంతికి – నాంది యీనాడే. 4

కూడులేక గుడ్డలేక
గూడులేక గోడుజెంది
దాసత్వం పారిపోవ
దారిద్ర్యం మారిపోవ
పోరాటం గావించే
ప్రజాకోటి విముక్తికై
వేగుచుక్క– వుదయించిన
వెలుగుబాట చూపించిన
నవయుగ మీనాడె
జనయుగ మీనాడె 5

నవ చైనా

అది చైనా
నవ చైనా
తరతరాల దాస్యాన్ని తరలిస్తూ
యుగధారను మరలిస్తూ
దేశదేశ బాధితులకు
శాంతిత్రోవ చూపిస్తూ
సందేశం వినిపిస్తూ
పురోగమించు దివ్యతార ||అ|| 1

తొలిసారిగ కూలీలే
దేశానికి పాలకులుగ
కర్షకులే కృషిభోక్తలుగ
నిర్మాణం గావించిన
ధనస్వాముల-భూస్వాముల
రాపిడీని-దోపిడీని
అధికార నిరంకుశాన్ని
నిర్యాణం గావించిన
వీరభూమి, విజయభూమి ||అ|| 2

డాలర్లు, స్టర్లింగులు
దగాకోరు రాజీలు
మోసాలు, వేషాలు

తుపాకులు, ఫిరంగులు
టాంకులు, విమానాలు
పనిచేయని ప్రబలశక్తి, ప్రజాశక్తి ॥అ॥ 3

మీ కలలు కల్లలని
మీ ఆశలు, అడియాశలని
చూపిస్తూ
సామ్రాజ్యవాదుల గుండెల్లో
అపజయఢంకా మ్రోగిస్తూ
పాత యుగానికి
స్వస్తివాచకం వినిపిస్తూ
వర్గరహిత సమాజానికి
సోపానాల్ నిర్మిస్తూ
ప్రపంచ పీడితులకు పిలిపిచ్చే ॥అ॥ 4
అది చైనా
నవ చైనా

మలయా

మలయా
ప్రళయానల నిలయా
కనలికనలి కుమిలికుమిలి
క్రుంగి వంగి కృషియించే
నీ యెండిన గుండెల్లో
మండే మహాగ్ని జ్వాల
ప్రచండమై, ప్రదీప్తమై
అనంతమై, అఖండమై
పొంగిపొంగి నింగికంటి
ముక్కంటి కంటిమంట
కంటె యినుమిక్కిలిగా
సముజ్వలించి, ప్రజ్వలించి
నరభక్షక సంహారం
శత్రుకోట పరిహారం
గావిస్తున్నది. 1

తరతరాలు తలనెక్కి
నరనరాన్ని నలగద్రొక్కి
కరాలుచెక్కి, వరాలుమెక్కే
పరాన్నభుక్కుల పాపపు హక్కుల
వారసత్వం - క్రూరకృత్యం
వదలమనుచు - కదలమనుచు
రొమ్ముపైన కుంపటెత్తి

వెన్నపైన తంపటెత్తి
స్మశానవాటిక
పిశాచ నాట్యాంజేసే
జనహంతకుల, నంతం
గ విస్తున్నది. 2

కంకాళాల్ కదిలించి
శంఖాలను పూరించి
శృంఖలాలు విదిలించి
రణవీరుల, యుద్ధవీరుల
ఘనయోధుల సృష్టించి
కష్టాలను, నష్టాలను
అధిగమించి, పురోగమించి
నవలోకం – సమభావం
సమధర్మం – సౌభాగ్యం
శాంతి, సౌఖ్య – అభ్యుదయం
సంస్థాపన గావించగ
అక్రమ వినాశనం
అధర్మ నిర్మూలనం
గావిస్తున్నది. 3

స్టాలిన్ వున్నాడు

స్టాలిన్ మరణించలేదు
స్టాలిన్ మరణించబోడు
ఉన్నాడయ్యా స్టాలిన్ – వున్నాడు.
అనంతకోటి విజయీజన
ఐక్యకంఠ నినదంలో
కోటకోట్ల పీడితప్రజ
హృదయకుహార స్పందనలో ॥ఉ॥ 1

జాతుల పరిపాలనలో
బోరున యేడ్చేవారికి
దారిజూపి ధైర్యమిచ్చి
అధికారం అందించిన
అనుపమ కృషిచిహ్నాల్లో ॥ఉ॥ 2

రెండవ ప్రపంచయుద్ధం
మొండిశత్రువు ఫాసిస్టుల
దంషిగపరిమార్చి, లోక
గండం లేకుండ జేయు
నాటి సమరవ్యూహాల్లో ॥ఉ॥ 3

సమరానంతర సమయం
పునర్నిర్మాణ సంరంభం
మండిన గృహములు

మొండిన పొలములు
కాలిన భవనాల్
కూలిన యంత్రాల్
లెక్కలేని కట్టడాలు
చక్కజేయు పథకాల్లో
క్రొత్తవాటి నెన్నెన్నో
సృష్టించే సూత్రాల్లో ॥ఉ॥ 4

నలుగడలను వెలుగొందే
శాంతికాంతి. వెల్లువలో
లోకమెల్ల విలసిల్లే
అభ్యుదయపు బాటల్లో
సిద్ధాంతిగా - రచయితగా
వీరుడుగా - రణధీరుడుగా
ప్రజానేతగా - సుఖప్రదాతగా ॥ఉ॥ 5

రణోన్మత్త గజాసురుల
కుటిలయత్నజాలమెల్ల
కాల్చివేయ, కూల్చివేయ
గుండెల్లో పదునిడే
సింహమై, నృసింహమై
లోకాలకు దారిజూపు
శోకాలను రూపుమాపు
జ్యోతియై, మహాజ్యోతియై ॥ఉ॥ 6

సోషలిజం స్థాపనలో
కమ్యూనిజం పునాదుల్లో
చెరగని చరిత్రలో
తరగని ధరిత్రిలో
అమరుడై, అజేయుడై
దిగంతుడై అనంతుడై ||ఉ|| 7

జనం - ధనం

జనస్వామ్యం
జనంజనం
మహాజనం
ప్రభంజనం. 1

ధనస్వామ్యం
ధనంధనం
అంతాధనం
అహంకృతం
నిరంకుశం
దురాపథం
ప్రజా బంధనం. 2

జనం ధనం
పరస్పరం

అనుక్షణం
ఘర్షణం
ప్రతిక్షణం
తీక్షణం. 3

జనంపైన
ధనంపెత్తనం
వరాల వర్ధనం
జనాల మర్ధనం
యిదే దుర్దినం
అనంత రోదనం
అనేక వేదనం. 4

ధనం బలం
క్షణం క్షణం

ప్రతినిముషం
ప్రతినిత్యం
ఫలాయనం. 5

జనం బలం
నిరంతరం
అభ్యుదయ
పరంపరం 6

యిదే నిజం
యేది అహం
లేదు హాజం
రాదు ధనం
దొరతనం 7

నిజంనిజం
యికకాలం
అధికారం
పేదజనం
హస్తగతం 8

చరితచక్రం
కాదువక్రం
త్రివిక్రమం
జన పరాక్రమం 9

వచ్చేకాలం
హెచ్చగుమోదం
విచ్చును భేదం
చచ్చును ఖేదం
జన సందోహం
లో, కోలాహలం
స్థిరం, సుస్థిరం 10

లేదిక నిర్బంధం
రాదిక ప్రతిబంధం
కనం వినం
బానిసబంధం
యిది హృదయం
మహోదయం
సుభోదయం
సుఖోదయం 11

సౌఖ్యము - శాంతి

యెండనక వాననక
బండచాకిరి చేసి
తిండేమి మిగలక
యెండేటి కార్మికుల
మండే క్షుధాగ్నులు
మాయమై పోయిన
ఆనాడె సౌఖ్యంబు
ఆనాడె శాంతి. 1

హలము చేపట్టియు
పొలమంత దున్నియు
రాజనాల్ పండించి
భోజనానికి గుందు
కర్షకుల కష్టాలు
కడకంట తొలగగా
ఆనాడె సౌఖ్యంబు
ఆనాడె శాంతి. 2

శృంగార భవనాలు
పొంగార నిర్మించి
బంగారు వస్త్రాలు
రంగుమీరగ నేసి

పలు తెరగు వస్తువుల
బహువేలు సృష్టించి
వివిధ కళలను అల్లి
విజ్ఞాన మెదజల్లి
భృతికొరకు గతి లేక
మతి లేక వెతజెందు
తలదాచుకొన కొంప
మొలగాచుకొన చింపి
యిల లేని మానవులు
వెదకినా కనరాని
ఆనాడె సౌఖ్యంబు
ఆనాడె శాంతి. 3

పల్లెలు పట్టణాల్
కొల్లలుగ దిరిగిన
పని లేక పస్తుండి
పలవరించే ప్రజలు
ఆకలితో అల్లాడి
అలమటించే జనులు
లేరనుచు చాటిన
ఆనాడె సౌఖ్యంబు
ఆనాడె శాంతి. 4

యుద్ధపిశాచీ!

తిరిగి మరల గొంతు నెత్తి
మరచిన జగతిని చరచి
విషరాగం ఆలపించి
మత్తెక్కి పాడబోకుమా
మిత్రీ
కొత్త ఆట ఆడరాకుమా
శాంతిఘాతకులు చెంతనుండెనని
సౌఖ్యజగతినే చీల్చివేతునని
పాతకాలమే తిరిగి వచ్చెనని
వుబ్బి గంతు లేయబోకుమా
శత్రీ
నీ యబ్బ తరము గాదు చూడుమా
నీ చేతలు చూచినాము
నీ క్రౌర్యం మరచిపోము
నీ పాచిక పార దికను
క్రొత్త జగతి గుర్తు లేదొకో
తొత్తా
తుత్తునియలు జేయబోమొకో
మానవ రక్తం మానవుడే
పూసిక త్రాగే ఆ పాలన
పూడ్చిపెట్టివేస్తున్నాం

నిలువ నీడ నీకు లేదిక
పొమ్మా
తలపు వీడి వల్లకాటికి
అడియాసలు పడబోకుమ
మిడిగంతులు వేయకుమ
గడిచిపోయె నీదు బ్రతుకు
యెల్లకాలం నిద్రబొమ్మా
సమాధిలో
చెల్లెను నీ కాల మమ్మా

శాంతి కపోతము

శాంతి కపోతము
కాంతి ప్రపూతము
విశాల వినీల వియత్తలాన
సురమ్య సుందర ధరాతలాన
తెల్లని రెక్కలు విప్పింది
చల్లని పలుకులు పలికింది.

కాలమేఘముల కారుచీకటులు
ఘోర భయంకర ప్రళయ గర్జనలు
కొండల పిండవు పిడుగుల తండము
విశ్వ వినాశక విషవర్షం
విచ్చి, సొచ్చి, వచ్చి, చచ్చి

చీలి, పోలి, కాలి, కూలి
అనంత కాలవాహినిలో
అంతర్హిత మవ
నవోజ్వల దృక్కుల బరిపింది
సముజ్వల తేజము నింపింది
దినదినవర్ధిత దివ్యవివేకం
నందనవన సమవందిత లోకం
శుభసముదాయక సుఖమయలోకం
నిర్జించగ యోచించిన
నిర్మూలించగ ఆశించిన
మాతృత్వం వికసించిన
భ్రాతృత్వం చిగురించిన
ప్రేమలతలు పుష్పించిన
యీ భూమిని
విలయకాల రుద్ర భూమి
పై శాచిక నాట్యభూమి
వొనరించగ తలపెట్టిన
నిర్మించగ సమకట్టిన
ముష్కర, తస్కర, బర్బర, క్రూరులు
నిర్దాక్షిణ్యా, నిరంకుశ, నీచులు .
రిక్తవోయి తత్తరిల్ల
భీతిజెంది గోత గూల
మహోద్ధృతశక్తిని జూపింది
మహిమాన్విత విజయం పొందింది.

క్షామము

కదిలింది కదిలింది
కరాళ దంష్ట్రల కదిపింది
మృత్యుగహ్వరము తెరిచింది
విషపు పిడికిలని విప్పింది
యినుప పాదముల త్రొక్కింది
కరువు రాక్షసి కదిలింది. 1

వంగదేశమును కృంగదీయుచు
బీహారురాష్ట్రం బీటలు బరిపి
కేరళక్షేత్రం కోరలు నలిపి
రాయలసీమ రక్తం పిండి
విశాఖజిల్లా విడిచిపెట్టనని
కరువు రాక్షసి కదిలింది. 2

బుగ్గి జేసెడి అగ్గిపిడుగులు
ఫెళఫెళ-మాడ్చే ఫిరంగి బాంబులు
మసి గావించే విషవాయువులు
నాశం జేసే నాజీతత్వం
నాలో కలదని
కరువు రాక్షసి కదిలింది. 3

తిండిదొంగలు తండ్రులు నాకని
లంచగొండులు తమ్ములు నాకని
కుక్కలు నక్కలు గృధ్రసంతతి

వెంటను నడిచే పరివారంబని
మనుజుల మాంసం
మరగిన భూతం
కరువు రాక్షసి కదిలింది. 4

కళకళలాడుచు కాంతులు గొలిపే
యెన్నో పట్నాల్ యెన్నో పల్లెలు
గేహకుడ్యములు, వాడలు, పేటలు
కాంతి తప్పి విభ్రాంతి దోప
మసియై, నుసియై, పసజెడ
కరువు రాక్షసి కదిలింది. 5

పిన్నల కన్నెల
వృద్ధుల - పెద్దల
పురుషుల - స్త్రీల
పాలిట క్షుత్తై
కాలెను చితియై
కరువు రాక్షసి కదిలింది. 6

మారణ హోమం
ఆరని శ్మశానం
కోరని పాశం
ధనాశాపరుల మోసం
సుఖజనవన వినాశకారిణి
తీరని దుఃఖస్వరూపిణి
కరువు రాక్షసి కదిలింది. 7

విచ్ఛిన్నత

కుటుంబ బంధాలు కూలుతున్నాయి
బ్రతుకు వొకొక్కరిదే భారమైపోయె
అన్నదమ్ముల మధ్య అక్కచెల్లెండ్రలో
తల్లిదండ్రులయందు తనయులలోన.
భార్యాభర్తల మధ్య బంధాలు తెగెను
యెవరి త్రోవను వారె వెదుకంగ జొచ్చె
భార్యను పోషింప భర్త నిరసించు
తనయుని పోషింప తండ్రొప్పకుండె
తల్లి తన తనయనే దారిలో వదలి
తన పొట్ట చేకొని తరలిపోతుండె
తండ్రి తన బిడ్డను దరిలేక నేడు
భర్త తన భార్యను భరియింపలేక
వుదరపోషణకునై విధిలేక యేడ్చి
వేశ్య గృహములయందు విడుచుచున్నారు
క్షామాగ్నిజ్వాలలు చెలరేగి మిగుల
మసి యొనరించెను మనుజ జ్ఞానంబు
నుసి యొనరించెను నీతినియమంబు
కసిగొని పరివారముల నెన్నొ కూల్చె.

మధ్య వర్గము

కనుల వెంబడి నీరు కారును
అడుగ నొరులను చేయి సాగదు
అడుగకుండిన ప్రాణ మాగదు
వెలికి వచ్చిన మనసు నొచ్చును
యేమిచేయను మతికి తోచదు
ప్రాణ మెట్టుల ఆగునో
యీ జీవ మెట్టుల సాగునో. 1

"ఆత్మాభిమాన మెన్నడు
చావనీయదు పౌరుషంబును
ప్రాణములు యిల పోయినను సరె"
అనెడు సామెత నేడు యిచ్చట
సత్యమని రుజువాయెగా
నిత్య మెందరో చావగా. 2

వున్న సర్వము చెల్లిపోగా
జగతి అంతా శూన్యమవగా
బ్రతుకు తెరవే లేదటంచును
విధిని దిట్టుచు గతికి యేడ్చును
త్రోవ యెన్నడు కలుగునో
యీ బాధ యెన్నడు తొలగునో. 3

దేవులాట

వెదకుచున్నారోయి – వెదకుచున్నారు
వేయి నాల్కలతోడ – వెదకుచున్నారు.

బక్కచిక్కిన డొక్కలతో
చివికిపోయిన బట్టలతో
కుక్కల మాడ్కి – నక్కల మాడ్కి
దివారాత్రము యేకదీక్షతో
యెంగిలి మెతుకుకు బజారువెంట
వెదకుచున్నారోయి – వెదకుచున్నారు
వేయి నాల్కలతోడ – వెదకుచున్నారు.

గర్భగుడి లోపలి గబ్బిలాయిల మాడ్కి
పగలు మొగమును జూడ
భయమొంతో తోచగా
కట్టుపుట్టము లేక – మెతుకెతకరాలేక
సిగ్గునకు వోడియు – ఆకలికి మాడియు
భగ్నజీవిత మెట్లు – గడిపెదమురా యంచు
వెదకుచున్నారోయి – వెదకుచున్నారు
వేయి నాల్కలతోడ – వెదకుచున్నారు.

కూటిమెతుకు హెచ్చరిక

వెదకుచున్నారోయి - వెదకుచున్నారు
ఆశతో కేలెత్తి - సోషతో మొర లిడుచు
అసువు లుండాలనే - ఆతురత చెలరేగ
సందుగొందుల్లోన - వీథివీథులయందు
మింగిపారేసిన - యెంగిలాకుల్లోన
కానబడతానంచు - కలదిరుగుచున్నారు
వినరోయి వినరోయి - కనరోయి కనరోయి
తిండిదొంగలు దొడ్డ - బండకో వ్యేశారు
తప్పించుకోకుండ - తాళాలు బెట్టారు
నేను కావాలంటె - నేను రావాలంటె
మర్మ మిడిచి మీకు - మాటొకటి చెబుతాను
జనులంత యేకమై - చెరలు విడిపించండి
తిండిదొంగల దొడ్డ - తిక్క వొదిలించండి
యెక్కువగ పంటలను - వేగముగ పండించి
సక్రమ పంపక - సహకారమును జేస్తు
నేను జెప్పినయట్లు - నీమముగ మీరంత
అమలుజరిపారంటె - హాయిగా వుంటారు.

తండ్రి - కొడుకు

ఆకలి తెలిసిన అన్నల్లారా
ఆస్తుల నెరిగిన అక్కల్లారా
పిల్లల గన్న తల్లుల్లారా
విన్నారా యీ కథను
కన్నారా యీ వ్యథను.

విజ్ఞానంతో విలసిలు దేశం
నాగరికతతో రంజిలు దేశం
ఆస్తుల నెప్పుడు నరసేష దేశం
కరువుతో దేశం కాలిపోయెను
ఆకలిమంటల కాహుతియ్యెను
సోషతో ప్రజలు సోలిపోయెను
జాలిని గొలిపే యీ కథను
హృదయం కరిగే యీ వ్యథను
విన్నారా బాబు
కన్నారా మీరు.

పని జూపండని పలువరించిరి
దిక్కు జూపుడని దేవురించిరి
దినముల తరబడి పస్తులుండిరి
క్షుధాగ్ని జ్వాలల నృక్కిపోయిరి
జగత్తంతయు శూన్యము గాగ

అర్థంగాని పయనము వేగ
తండ్రీ కొడుకులు చేశారు
విన్నారా యీ కథను
కన్నారా యీ వ్యథను. 1

పితాసుతుల వాత్సల్యము వీడి
నడువగజొచ్చిరి తిండికి వాడి
ఆకలి మినహా జ్ఞానం లేదు
ఆకలి అణగక ప్రాణం రాదు
అడుగులు తడబడ నడిగే యాత్రల
జాలిని గొలిపే యీ కథను
హృదయం కరిగే యీ వ్యథను
విన్నారా బాబు
కన్నారా మీరు. 2

క్షేత్రభూమనే యాత్రను జేర్చ
మధ్యన మజిలీ యీ సత్రం
అన్న మన్నమని మన్నించండని
చేరిరి వారలు ఆ సత్రం
విన్నారా యీ కథను
కన్నారా యీ వ్యథను. 3

అన్నం అన్నం నాకో బాబని
ఆకలి ఆకలి నాకో బాబని
హాహాకారాల్ చెలరేగ

తండ్రి కొడుకులను జ్ఞానం వీడి
త్రోసుక ముందుకు వేవేగ
ఆశతో నడిచిరి దోసిలిడి
జాలిని గొలిపే యీ కథను
హృదయం కరిగే యీ వ్యథను
విన్నారా బాబు
కన్నారా మీరు. 4

కల దొక్కరికే గంజి యిచ్చట
రం డొకరేనని పిలచి రచ్చట
తండ్రిని తోచుక తనయుడు ముందు
చేయిని చాచెను గంజిని పొంద
పారము ముట్టిన పరిణితి దెలిపే
భారతదేశ అభాగ్య జీవితం
విన్నారా యీ కథను
కన్నారా యీ వ్యథను. 5

ఆరిన పేగున అతకక గంజి
గ్రుడన కక్కుచు త్రాగిన గంజి
అసువుల వీడెను అచ్చటనే
ఆకలి మినహా జ్ఞాన మెరుంగక
అన్నం దొరికే దారి యెరుంగక
మరిదప్పగ యీ గతి నాతండ్రి
జీవచ్ఛవముగ జూచుచునుండె
బాహ్యేంద్రియంబులు బాధకు లొంగి

నెరవేర్చవుగా తమ కర్తవ్యం
చెరచెర నడిచి తనయుని కడకు
చేతితో నెట్టి తన్నొక కడకు
కొడుకు కక్కిన ఆ గంజి
నేలను యింకే ఆ గంజి
దోసిలితోడుత నా తండ్రి
జుర్రున త్రాగెను నాతండు
మానవలోకం మరువని శోకం
కన్నీ రొలుక క్రమ్మ చెమటలు
జాలిని గొలిపే యీ కథను
హృదయం కరిగే యీ వ్యథను
విన్నారా బాబు
కన్నారా మీరు. 6

తెలుగుసీమలో విలయతాండవం

కరువు రాక్షసి
మృత్యుగహ్వారం
తెలుగుసీమలో విప్పింది
విషాదరేఖలు గప్పింది.

చెరువులు యెండి - పైరులు మండి
త్రాగను నీళ్ళు - తినుటకు తిండి
చేసే చేత - పశువుకు మేత
యెచ్చట దిరిగిన కానగరాక
యెందున జూచిన లేనే లేక
పొలము, పుట్ర, చెంబు, బింది
గొడ్డూ, గోద, పిల్లా, మేక
సర్వం అమ్మిన పొట్టకు చాలక
చింతగింజలకు, కలబందలకు
సంచారం చేస్తున్నారు. 1

యిల్లువాకిలికి దణ్ణంబెట్టి
తట్ట బుట్ట నెత్తిని బెట్టి
కన్నగడ్డపై కన్నీగ్గార్చి
బహుశోకంతో బారులు దీర్చి

వూళ్ళకు వూళ్ళే ఖాళీజేసి
పరాయి భూమికి పోతున్నారు. 2

పెరటిలోని చెట్లను గొట్టి
పేళ్ళన్నిటిని నెత్తిన బెట్టి
పట్నం బోయి అమ్మినగాని
గడవక పాపం తమ సంసారం
గంజో గడుగో వుంటే చాలని
కాలే కడుపుకు పోసేస్తామని
మలమలమాడి నకనకలాడి
గంజికేంద్రముల కెగబడ్డారు
అన్నాతురుల హాహాకారాల్
ఆక్రందనలు ఆకలి చావులు
అరికట్టాలని ఆంధ్రులు లెండి
నూకలుగాని రూకలుగాని
తోచిన సాయం చేయండి
పార్టీకక్షలు ఆవల నెట్టి
మానవత్వమను లక్ష్యము బట్టి
గంజికేంద్రములు, అన్న సత్రములు
చెరువులు, బావులు, యెన్నో బాటలు
చిన్నవి పెద్దవి ఆనకట్టలు
నిర్మించంగా, నెలకొల్పంగా
కరువు రాక్షసికి స్థిరవుద్వాసం
తెలుగుసీమలో వినిపించంగా

సిరిసంపదతో, శాంతిసౌఖ్యముతో
తెనుగుదేశము విలసిల్లంగా
నడుములుగట్టి ముందుకు రండి
ఆంధ్రులందరు వొక్కటవండి.

BCI

స్వతంత్ర ఆర్టు ప్రింటర్సు
విజయవాడ.

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	TPLA126B118
పుస్తకం పేరు	ప్రవాహం
తారీఖు	30/10/24
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	49
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	no ,BCI,CI,4
లేని పేజీలు	NO
తయారు చేసినది	nazma
పేజీలు విడదీసినది	nazma
స్కాన్ చేసినది	Hema
పరీక్ష చేసినది	PRAGATHI
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good